


## హుండీ ఆదాయం రూ.12,44,454

మంగళగిరి: స్థానిక గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.12,44,454 సమకూరింది. సోమవారం హుండీ లెక్కించిన అధికారులు వివరాలు వెల్లడించారు.



## భవానీ దీక్షల హుండీ ఆదాయం

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ అనంతరం హుండీల ద్వారా వచ్చిన కానుకలను సోమవారం లెక్కించారు. రూ.2.70 కోట్ల మేర ఆదాయం సమకూరింది.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 571.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,144 క్యూసెక్కులు విడుదలవుతోంది.

## న్యూస్‌రీల్

### గుంటూరు డీఆర్ఎంగా లిల్లీ పాండే

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కేంద్ర సాంస్కృతిక విభాగంలో డెప్యూటేషన్‌పై ఉన్న లిల్లీ పాండేను గుంటూరు డీఆర్ఎంగా నియమిస్తూ రైల్వే శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 26న గుంటూరు డీఆర్ఎంగా రాయపూర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆనంద్ మధుకర్‌ను నియమించిన రైల్వే శాఖ ఆ ఉత్తర్వులను తాజాగా రద్దు చేసి లిల్లీ పాండేను నియమించింది. ప్రస్తుత డీఆర్ఎం రామకృష్ణను ఎక్కడకు బదిలీ చేస్తారన్న విషయం ఆసక్తిగా మారింది.

### బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ



తాడేపల్లిరూరల్ (మంగళగిరి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కళాశాలలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఆచార్య వి.దివ్యతేజోమూర్తి మాట్లాడుతూ సామాజిక రుగ్మతలు రూపుమాపేందుకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా బాల్య వివాహ రహిత దేశంగా భారత్‌ను నిలిపే క్రమంలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆచార్య కెవి నిరుపమ, అధ్యాపకులు డాక్టర్ షకీలా నూర్ బాషా, ఝాన్సీ, ఉషాకిరణ్, స్వప్న, చంద్రమోహన్, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి



మంగళగిరి: ఎర్రచందనం వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని పలువురు వ్యాపారులు కోరారు. స్థానిక ఆటోనగర్‌లోని అటవీ శాఖ కార్యాలయంలో అటవీశాఖ పీసీసీఎఫ్ చిరంజీవిచౌదరిని కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎస్.రవిరాజు, సెక్రటరీ నాగయ్య, జాయింట్ సెక్రటరీ కొండేటి ఆంజనేయులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీతో పాటు గతేడాది కాలంలో విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వులతో కూడిన జీవో పుస్తకాన్ని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం వారి కార్యాలయాల్లో వేర్వేరుగా ఆవిష్కరించారు. ఉపాధ్యాయులందరికీ ఉపయుక్తంగా ఉండే విధంగా రూపొందించినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, ఎండీ ఖాలీద్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పి.నాగశివన్నారాయణ, పి.లక్ష్మీనారాయణ, కె.రమేష్, పి.పార్వతి, ఎస్ఎస్ఎన్ మూర్తి, జి.దాస్, సీహెచ్ లక్ష్మణ్‌కుమార్, కిషోర్, మూర్తి, శివరామకృష్ణ, బాలరాజు, కిరణ్, రమాదేవి, జయశ్రీ, కృష్ణారావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆకర్షణీయంగా వేంకటేశ్వరస్వామి నామాలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో విజయకీలాద్రి పర్వతంపై ఏర్పాటు చేసిన వెంకటేశ్వరస్వామి నామాలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. సోమవారం రాత్రి తాడేపల్లి పట్టణ పరిధితోపాటు, చుట్టుపక్కల ప్రాంతాల్లో కనిపించేలా త్రిదండి చినజీయర్ స్వామి ఆశ్రమ నిర్వాహకులు రెండువైపులా నామాలతో వెంకటేశ్వరస్వామి నామాలు ఏర్పాటు చేశారు. ఈ నామాలు చుట్టుపక్కల ప్రజలకు కనిపించడంతో ప్రజలు భక్తితో తరించారు.

# ఏటికి ఎదురీత

**కర్షకులకు కలసిరాని సేద్యం**

- అధిక వర్షాలతో పంటలకు నష్టం
- సాగుకు భరోసా ఏదీ?
- ఉచిత పంటల బీమాకు మంగళం
- ఆర్‌బీకేల సేవలు నిర్వీర్యం
- ధాన్యం, పత్తి, మిరపకు దక్కని మద్దతు ధర



రివైండ్ 2024

ఇటీవల కొల్లిపరలో వర్షానికి తడిచిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు(ఫైల్)

కొరిటెపాడు(గుంటూరు): రైతుకు ఈ ఏడాది కాలం కలసి రాలేదు. కర్షకులు ఏటికి ఎదురీదారు. ఖరీఫ్ సీజన్‌లో గుంటూరు జిల్లాలో 2,28,315 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. ఆగస్టు చివరిలో మునుపెన్నడూ లేని విధంగా కురిసిన వర్షాలకు సుమారు 11 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. తిరిగి సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు 46,680 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇది దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. పంటలకు మద్దతు ధర లభించడంలేదు. అయినా కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టలేదు.

**కాటన్ కాటు**

అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి బేళ్లకు ధర పడిపోవడంతో మద్దతు ధరకు కొనేందుకు ప్రైవేట్ వ్యాపారులు ముందుకు రాలేదు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధరగా నిర్ణయించి కొనుగోలు చేపట్టినా తేమశాతం నిబంధనలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయట మార్కెట్లో కేవలం రూ.6 వేల నుంచి రూ.6,800 వరకు పలకడంతో రైతులు నష్టపోతున్నారు.

**బా'ధాన్యం'**

ధాన్యం రైతూ ధరలేక విలవిల్లాడుతున్నాడు. జిల్లాలో ప్రభుత్వం 156 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. వీటిల్లో దళారులు, మిల్లర్ల ప్రమేయం ఎక్కువగా ఉంది. ధాన్యం మద్దతు ధర (75 కిలోల బస్తా) రూ.1,725 ఉన్నా రైతులకు దళారులు రూ.1,300 నుంచి రూ.1,400 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు.

**చె'మిర్చి'న కనులు**

గతేడాదితో పోలిస్తే మిరప ధరలు సగానికి పడిపోయాయి. గతేడాది సీజన్ ఆరంభంలో క్వింటా మిరప ధర రూ.22 వేలు వరకు పలకగా.. ఈసారి గరిష్టంగా రూ.14 వేలు దక్కడమే గగనంగా ఉంది. సీజన్ ఆరంభంలోనే ఇలా ధరలు పడిపోతే.. కొత్త ఏడాదిలో అత్యధికంగా వచ్చే దిగుబడులను ఎలా అమ్ముకోవాలోనని రైతులు కుమిలిపోతున్నారు.



గత ప్రభుత్వంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా అందించిన ట్రాక్టర్లతో గుంటూరులో రైతులు నిర్వహించిన ప్రదర్శన (ఫైల్)

**అన్నదాతా 'దుఃఖీభవ'**

ఖరీఫ్ ముగిసి.. రబీ కూడా సగం గడిచినా కూటమి సర్కారు అన్నదాతా సుఖీభవ ద్వారా ఇస్తానన్న రూ.20వేలు చెల్లించలేదు. దీంతో జిల్లావ్యాప్తంగా 1,23,885 మంది రైతులు ఈ ఏడాది రూ.247.77 కోట్లు నష్టపోయారు. పెట్టుబడికి కర్షకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**గత ప్రభుత్వం అడుగడుగునా అండ**

రైతులకు గత ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలిచింది. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తు నుంచి పంట కొనుగోలు వరకు బాసటగా నిలిచింది. ఐదేళ్లపాటు ఏటా ఖరీఫ్ ఆరంభంలోనే వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందించింది. కౌలు రైతులకూ ఈ పథకాన్ని వర్తింపజేసింది. పత్తి, మిర్చి, వరి పంటలకు మద్దతు ధర లభించేలా చర్యలు చేపట్టింది. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించింది. యంత్రసేవా పథకం ద్వారా సబ్సిడీపై ట్రాక్టర్లు, యంత్రపరికరాలు అందించింది.

**రైతులంటే చిన్న చూపు తగదు**



కూటమి ప్రభుతానికి రైతులంటే చిన్నచూపు. వారిని ఆదుకునేందుకు మీనమేషాలు లెక్కిస్తోంది. ఖరీఫ్‌లో వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. అయినా సర్కారు పరిహారం అందించలేదు. పెట్టుబడి సాయమూ ఇవ్వలేదు. ఫలితంగా కర్షకులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

–టి.వెంకటస్వామి, గుంటూరు

**గత ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ లబ్ధి ఇలా..**

| సంవత్సరం | రైతుల సంఖ్య | విడుదలైన నిధులు (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2019–20 | 1,21,888 | 164.55 |
| 2020–21 | 1,25,894 | 169.96 |
| 2021–22 | 1,15,083 | 155.36 |
| 2022–23 | 1,20,689 | 162.93 |
| 2023–24 | 1,26,030 | 170.14 |

**ఉచిత పంటల బీమాకు మంగళం**

గత ప్రభుత్వం ఐదేళ్లు ఉచిత పంటల బీమా పథకాన్ని దిగ్విజయంగా అమలు చేసింది. ఈ ఏడాది కూటమి సర్కారు ఆ పథకానికి మంగళం పలికింది. ప్రీమియం ధరలు నిర్ణయించింది. హెక్టారుకు రైతులు చెల్లించాల్సిన ప్రీమియం ఇలా..

| పంట | ప్రీమియం(రూ.లలో) |
|---|---|
| జొన్న | 140 |
| మొక్కజొన్న | 119 |
| పెసర | 285 |
| మినుము | 113 |
| శనగ | 125 |

**గత ప్రభుత్వ హయాంలో ఉచిత పంటల బీమా లబ్ధి ఇలా..**

| సంవత్సరం | రైతుల సంఖ్య | లబ్ధి(రూ.కోట్లలో) |
|---|---|---|
| 2019 | 11,948 | 10.62 |
| 2020 | 27,743 | 15.74 |
| 2021 | 25,236 | 37.95 |
| 2022 | 14,542 | 4.16 |

### ఆర్‌బీకేల సేవలు నిర్వీర్యం

గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌బీకేలను కూటమి సర్కారు నిర్వీర్యం చేసింది. రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి సేవలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తోంది. ఫలితంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఆర్‌బీకేలు అందించిన సేవలకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ సర్టిఫికెట్ కూడా లభించింది.



వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

# ఎస్సీ వర్గీకరణ వన్‌మెన్ కమిషన్‌కు భారీగా వినతులు



వనమెన్ కమిషన్ ముందు అభిప్రాయాలు తెలియజేస్తున్న దళిత నేతలు

**అభిప్రాయాలు తెలియజేసిన 1200 మంది**

గుంటూరు వెస్ట్/నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వన్‌మెన్ కమిషన్‌కు భారీగా వినతులు వచ్చాయి. వివిధ ఎస్సీ ఉపకులాలకు చెందిన సుమారు 1200 మంది తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా అందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వన్‌మెన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ్, ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో అభిప్రాయాల సేకరణ జరిగింది. అధికంగా మాల సంఘాల నుంచి ఎక్కువ వినతులు వచ్చాయి. ఎస్సీ ఉపకులాల నుంచి కూడా దళిత నాయకులు వినతులు అందించారు. వినతుల స్వీకరణకు కలెక్టరేట్‌లో పటిష్ట ఏర్పాట్లు చేశారు. కొందరు నాయకులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా పాయింట్ వద్ద బహిరంగంగానే తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నాయకులు ఏమన్నారంటే..

**న్యాయం చేయండి**



మేము ఎస్సీ ఉపకులంలో ఉన్నాం. ఆశించిన స్థాయిలో రిజర్వేషన్లు అందడం లేదు. ఫలితంగా తరతరాలుగా పేదరికంలో మగ్గుతున్నాం. కమిషన్ సమగ్ర విచారణ జరిపి మా కులానికి న్యాయం చేయాలి.

– వనం నాగేశ్వరరావు, ఆల్ ఇండియా బుడగ జంగం ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్

**ప్రభుత్వాలు చేస్తున్న కుట్ర**



ప్రభుత్వాలు కుట్రపూరితంగా దళితుల మధ్య చిచ్చుపెడుతున్నాయి. ఇంతకాలం అందరూ అభివృద్ధి చెందాం, చెందుతున్నాం. ఇప్పుడు ఈ వర్గీకరణ నేపథ్యంలో మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టేందుకు యత్నిస్తున్న స్వార్థ పరుల కుట్రను దళిత నాయకులు అందరూ గుర్తించాలి.

– ఈమని చంద్రశేఖర్, జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు

**కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదు**



ఎస్సీ కులంలో అంతర్భాగమైన మాకు 16ఏళ్లుగా ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. ఫలితంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా కమిషన్ న్యాయం చేయాలి. ఎస్సీ బీలో ఉన్న మమ్మల్ని ఎస్సీ ఏ జాబితాలోకి మార్చాలి.

– కడ మంచి శ్రీనివాస్ బేద, బుడగ, జంగం సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

**దామాషా ప్రకారం పంచాలి**



దళితులందరికీ సమాన వాటా దక్కాలి. ఇప్పటికీ అనేక ఉప కులాలకు రిజర్వేషన్లు ఆశించిన స్థాయిలో అందడం లేదు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ల ప్రక్రియ అమలు చేస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదు. దళిత నాయకులంతా సమన్వయంతో వ్యవహరించాలి.

– చిలుమూరి శ్రీనివాసరావు, మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు (ఎమ్మార్పీఎస్ అనుబంధ సంస్థ)

**మంద కృష్ణకు రాష్ట్రంలో ఏం పని**



మాలలను అణగతొక్కేందుకు కూటమి ప్రభుత్వం ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ మందకృష్ణ మాదిగను పెంచి పోషిస్తోంది. అసలు మందకృష్ణకు రాష్ట్రంలో ఏం పని? వర్గీకరణను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం. కూటమి ప్రభుత్వం దుష్ట ఆలోచనలు మానుకోకుంటే తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోక తప్పదు.

– గోళ్ల అరుణ్‌కుమార్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు

# 'కిక్కు'రొక్కో

- న్యూఇయర్ నైట్ ఈవెంట్లలో మద్యానికి అనుమతి

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): కొక్కొరొకో అంటూ కోడి కూతతో నిత్యం వేకువ మొదలైతే 'కిక్కు'రొకో అంటూ కొత్త వత్సరానికి ఆహ్వానం పలికేందుకు మందు బాబులు సిద్ధమవుతున్నారు. దీంతో న్యూ ఇయర్ నైట్ ఈవెంట్లలో మద్యపానానికి ఎక్సైజ్ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈవెంట్ మేనేజర్లు ప్రత్యేక ఆఫర్లతో ప్రజలను ఆకర్షిస్తున్నారు. భారీ మొత్తంలో టికెట్ రేట్లు పెట్టి నగదు వసూలు చేస్తున్నారు. ఈ ఈవెంట్లకు కేవలం రూ.6వేల చలనాతో మద్యం దిగుమతి చేసుకునేందుకు ఎక్సైజ్ శాఖ అనుమతించింది. దీంతో మద్యాన్ని పారించేందుకు నిర్వాహకులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో మంగళవారం రాత్రి నైట్ ఈవెంట్ల నిర్వహణ, మద్యపానం అనుమతి నిమిత్తం ఎక్సైజ్ శాఖకు నాలుగు దరఖాస్తులు వచ్చాయి. తాడేపల్లిలోని విజయవాడ క్లబ్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని శ్రీకన్వెన్షన్, కేఎస్ఆర్ కంటిన్యూమ్‌లో ఈవెంట్ల నిర్వహణకు ఎక్సైజ్ శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పశ్చిమ నియోజకవర్గంలోనే మరోచోట ఈవెంట్ నిర్వహించేందుకు అందిన దరఖాస్తుకూ అనుమతి రానుంది. ఈ ఈవెంట్లలో సినీనటులతో ప్రత్యేక నృత్యరూపకాలు ప్రదర్శించనున్నారు. రుచికరమైన ఆహారం, మద్యాన్ని అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



**ఖాళీ స్థలంలో నిర్వహణకు నిరాకరణ**

గుంటూరు పశ్చిమ పరిధిలోనే ఓ ఖాళీ స్థలంలో నైట్ ఈవెంట్‌ను భారీగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్లాన్ చేశారు. ప్రకటనలు ఇచ్చారు. ఆన్‌లైన్‌లో టికెట్ల బుకింగ్‌నూ ఓపెన్ చేశారు. అయితే దీనికి పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు అనుమతి నిరాకరించారు. అయినా అధికారపార్టీ నేతల అండదండలతో ఈవెంట్‌ను అనుమతి లేకున్నా నిర్వహించాలని నిర్వాహకులు ప్లాన్ చేస్తున్నారు. దీనిపై పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# రక్షణకు తలమానికం

- హెల్మెట్ ధరిద్దాం.. ప్రాణాలు కాపాడుకుందాం
- వినూత్న ప్రదర్శనలతో పోలీసుల అవగాహన
- స్వయంగా రంగంలోకి దిగిన ఎస్పీ సతీష్‌కుమార్
- ఇప్పటికే జరిమానాల పరంపర
- కొత్త సంవత్సరంలో మరింత స్పీడు పెంచనున్న పోలీసులు
- ఈ ఏడాదిలో 380 మందికిపైగా మృతి, 1500 మందికిపైగా గాయాలు
- నిబంధనలను కట్టుదిట్టం చేయనున్న పోలీసుశాఖ



హెల్మెట్ వాడకంపై ప్రదర్శించిన కళారూపాన్ని తిలకిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): హెల్మెట్ ధారణపై పోలీసు శాఖ దృష్టిసారించింది. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ వాడకపోవడంతో 650 మందికిపైగా మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో హెల్మెట్ ధారణ అంశాన్ని రవాణా, పోలీసు శాఖ అధికారులు ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. తక్షణ చర్యలపై నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఫలితంగా ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. హెల్మెట్ ధారణను తప్పనిసరి చేసే చర్యలు చేపట్టారు. జరిమానాలకే పరిమితం కాకుండా ముందుగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్ డివిజన్ పరిధిలోనూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

**హెల్మెట్ లేకే మరణాలు**

రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక శాతం మరణాలు హెల్మెట్ ధరించకపోవడం వల్లే సంభవిస్తున్నాయని అధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల గుంటూరు రింగురోడ్డు వద్ద రాత్రిపూట రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో అయ్యప్పమాల వేసుకున్న ఓ యువకుడితో పాటు ఓ సీనియర్ సిటిజన్ మరణించారు. వీరిద్దరూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు బలమైన గాయాలై మృతిచెందడం విషాదకరం.

- మంగళగిరి బైపాస్‌లో జరిగిన మరో ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి లారీ కింద పడి తల నుజ్జునుజ్జు అయి మరణించాడు. హెల్మెట్ ఉండి ఉంటే బతికేవాడు.
- కొల్లూరు వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను కారు ఢీకొంది. ఈ ఘటనలో హెల్మెట్ లేకపోవడంతో భర్త అక్కడికక్కడే మరణించాడు. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి.

**కళా రూపాల ద్వారా**

పోలీసు శాఖ ప్రత్యేక కళారూపకాల ద్వారా వినూత్న ప్రదర్శనలతో ప్రజల్లో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తోంది. నిబంధనలను వివరిస్తూ ప్రమాదాలు జరిగే తీరును కళ్లకు కడుతున్నారు. యమదూతలు వచ్చి పట్టుకెళ్లినట్టు వినూత్నంగా ప్రదర్శనలు చేపడుతున్నారు. యమధర్మరాజు వేషధారి చేత నిబంధనలు చెప్పించడం, హెల్మెట్ ధారణతో ప్రయాణించే వారికి వినాయకుని వేషధారి గులాబీ పువ్వు అందించి అభినందించడం వాహనదారులను ఆకట్టుకుంటోంది. దీంతోపాటు పోలీసులు హెల్మెట్ ధరించి ద్విచక్రవాహన ర్యాలీలు చేపడుతున్నారు. కొత్త సంవత్సరం నుంచి కట్టుదిట్టంగా నిబంధనల అమలుకు సిద్ధమవుతున్నట్టు ఎస్పీ సతీష్‌కుమార్ చెబుతున్నారు. అందరూ హెల్మెట్ ధరించాలని కోరుతున్నారు.

**గుంటూరు జిల్లాలో గత మూడేళ్లుగా ప్రమాదాల సంఖ్య ఇలా..**

| సంవత్సరం | ప్రమాదాలు | మరణాలు | క్షతగాత్రులు |
|---|---|---|---|
| 2022 | 1092 | 427 | 2,122 |
| 2023 | 972 | 334 | 1,782 |
| 2024 (నవంబర్ వరకు) | 855 | 352 | 1,900 |

(మృతుల్లో 60శాతం హెల్మెట్ లేకపోవడం వల్లే చనిపోయారు)

**తలకు గాయం కావడం వల్లే మరణాలు**



ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాల్సిందే. ఈ ఏడాది జరిగిన ప్రమాదాల్లో 60శాతం మంది హెల్మెట్ లేక తలకు బలమైన గాయం కావడం వల్లే మరణించారని తేలింది. ప్రతిఒక్కరూ హెల్మెట్ పెట్టుకుని మాత్రమే ద్విచక్రవాహనంపై ప్రయాణం మొదలు పెట్టాలి. లేకుంటే భారీ జరిమానాలు విధిస్తాం. ప్రజలు అర్థం చేసుకోవాలి.

– ఎస్ సతీష్‌కుమార్, ఎస్పీ, గుంటూరు జిల్లా

**ద్విచక్ర వాహన ప్రమాదాలకు కారణాలు**

- రోడ్డు మలుపుల వద్ద వేగంగా వెళ్లడం, జాగ్రత్తలు పాటించకపోవడం
- కూడళ్లలో రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా దూకుడుగా వెళ్లడం
- ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్లడం వల్ల వాహనం అదుపు తప్పడం
- మద్యం మత్తు, నిర్లక్ష్యపు డ్రైవింగ్, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం
- సరైన నైపుణ్యం లేని డ్రైవింగ్, రహదారి భద్రతపై అవగాహన లేకపోవడం

**వాణిజ్యం**

## నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,400 గరిష్ఠం : రూ. 3,600

మోడల్ ధర రూ. 3,000

**క్లుప్తంగా**

## డాక్టర్ నరేంద్రరెడ్డి సేవలకు ప్రత్యేక గుర్తింపు



**గుంటూరు మెడికల్:** ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) అభివృద్ధికి గుర్తింపు తీసుకొచ్చేందుకు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి అందించిన సేవలు అభినందనీయమని ఐఎంఏ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్‌వీ అశోకన్, డాక్టర్ అనిల్ కుమార్ జె నాయక్ పేర్కొన్నారు. ఐఎంఏ జాతీయ ఉత్తమ కార్యదర్శిగా సీనియర్ జాయింట్ రిప్లేస్మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషా లిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి అవార్డు అందుకున్నారు. 2023–2024 సంవత్సరానికి గాను గుంటూరు బ్రాంచిని అన్ని విభాగాలలో ఉత్తమ పనితీరు కనపరిచేలా తీర్చిదిద్దినందుకు గాను డాక్టర్ బూసిరెడ్డికి ఈ అవార్డు దక్కింది. ఇటీవల హైదరాబాదులో రెండు రోజులు పాటు జరిగిన ఐఎంఏ జాతీయ సమావేశాల్లో భాగంగా శనివారం రాత్రి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## డాక్టర్ చైతన్యకు అవార్డు



**గుంటూరు మెడికల్:** గుంటూరుకు చెందిన ప్రముఖ ఆర్థోస్కోపిక్ సర్జన్ డాక్టర్ ఘంటా చైతన్యకు టైమ్స్ ఐకాన్స్ ఆఫ్ హెల్త్ కేర్– 2024 అవార్డు లభించింది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ చేతుల మీదుగా విజయవాడలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ చైతన్య అవార్డు అందుకున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా వారు క్రీడల్లో గాయపడిన వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థోస్కోపీ ఆపరేషన్లు చేస్తున్న డాక్టర్ చైతన్యను ఆర్థోస్కోపీ అండ్ స్పోర్ట్స్ మెడిసిన్ విభాగంలో అవార్డుకు ఎంపిక చేశారు. అవార్డు అందుకున్న డాక్టర్ చైతన్యకు సోమవారం గుంటూరుకు చెందిన పలువురు ఆర్థోపెడిక్ సర్జన్లు, ఐఎంఏ వైద్యులు అభినందనలు తెలిపారు.

# తగ్గి పెరిగిన నేరాలు

- ఆరు నెలలు కష్టంగా..
- దూకుడు తగ్గిన ఏసీబీ
- స్పీడ్ పెంచిన సీఐడీ, విజిలెన్స్




**నగరంపాలెం:** ఈ ఏడాది (2024)లో ఆరు నెలలు ఇష్టంగా మరో ఆరు నెలలు కష్టంగా గడిచాయి. ఒక ఐదు నెలలు నేరాలు తగ్గినప్పటికీ... మిగతా నెలల్లో నేరాలు సంఖ్య పెరిగింది. లంచం తీసుకునే పలు ప్రభుత్వ శాఖల అధికారులపై ఏసీబీ అధికారులు కొరఢా ఝుళిపించారు. ప్రభుత్వ పథకాలు, సొంత పనుల నిమిత్తం వెళ్లే బాధితులను ఇబ్బందులకు గురిచేసిన అధికారులను చాకచాక్యంగా పట్టుకున్నారు. తొలి నాలుగు నెలల వ్యవధిలో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదిదారుతో దాడులు కొనసాగించారు. వేలల్లో డబ్బులు తీసుకుంటున్న పలువురు అధికారులు చిక్కారు. ఏసీబీ వరస దాడులతో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల అధికారులు హడలిపోయారు. మే నెల నుంచి సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఏసీబీ దూకుడు చాలా వరకు మందగించింది.

■ ఫిబ్రవరి ఒకటిన జిల్లా ఎస్పీగా తుషార్‌డూడీ బాధ్యతలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయన్ను బదిలీ చేయగా, జూలై 17 నూతన ఎస్పీగా సతీష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల వేళ అప్పటి ఐజీ పాల్‌రాజ్‌ను బదిలీ చేయగా, ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠిని నియమించారు. ఎన్నికలు ముగిశాక ఆయన్నే ఐజీగా కొనసాగుతున్నారు. ఇక జిల్లా ఏఎస్పీలు మొదలుకుని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు బదిలీలు ఒక్కొక్కటిగా వేగవంతం చేశారు. ఈ క్రమంలో కూటమికి అనుకూలమైన వివిధ కేటగిరిల్లోని పోలీస్ అధికారుల నియమాకాలు చేపట్టారు. సీఐల నియమాకాలు చేపట్టాక, వారు అనుకూలంగా లేకపోవడంతో మరోవైపు సస్పెన్షన్ల వేటు వేశారు.

■ మార్చి పదిన తెనాలికి చెందిన గీతాంజలి అనే మహిళ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. కేవలం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సోషల్ మీడియాలో మాట్లాడటం ఆమెకు శాపంగా మారింది. ఈ క్రమంలో ఆమెను టీడీపీ జనసేన సోషల్ మీడియా అసభ్యకరమైన పోస్టులు పెట్టడంతో తట్టుకోలేక ఆత్మహత్యకు ఒడిగట్టింది. ఈ ఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచనలం రేకెత్తించింది.

■ ది గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు సర్వత్రా ఉత్కంఠకు దారితీశాయి. ఈ క్రమంలో మార్చి 27న బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాసు వెంకటరెడ్డి విజయం సాధించారు.

■ జూన్ 6వ తేదీన పట్టాభిపురం పీఎస్ పరిధిలో మాజీ రౌడీషీటర్ షేక్ బాజిని అత్యంత దారుణంగా హతమార్చారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది.

రూ.లక్షలు ఆశ చూపి గుంటూరు నగరంలో ఉంటున్న ఓ వ్యక్తి వద్ద ఒక కిడ్నీ తీసేసుకున్నారు. ఈ ఘటన కూడా అప్పట్లో కలకలం రేకింది. ఈ కేసులు ఒకరిద్దర్ని అరెస్ట్ చేశారు.

■ ఆగస్టు 12న డ్రగ్ పెడ్లర్ రావి మస్తాన్ సాయిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రగ్స్‌తో సంబంధాలు ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లో పెను అలజడి రేపింది.

■ ఇక 27న ఎమ్మెల్యే మాధవి భర్త రామచంద్రరావు తమ పొలం దౌర్జన్యంగా అక్రమించుకున్నారని, క్రోసూరు మండలం పీసపాడు గ్రామానికి చెందిన కమ్మ వెంకట్రావు ఫిర్యాదు చేశారు. అయితే తమపై తప్పుడు కేసులు నమోదు చేశారని ఎమ్మెల్యే భర్త ఎదురు ఫిర్యాదు చేయడంతో అప్పటి పట్టాభిపురం పీఎస్ సీఐ పి.కిరణ్‌ను వీఆర్‌కు పిలిచారు.

■ ఇక చేబ్రోలులో బాలిక హత్య కేసులో నిందితుడు కృష్ణా జిల్లా వాసి నాగరాజుని నెలల తరువాత అరెస్ట్ చేశారు. అతన్ని పట్టుకునేందుకు గుంటూరు జిల్లా పోలీసులు తీవ్రంగా శ్రమించారు.

■ ఇక సెప్టెంబర్ నెలలో సైనెడ్ కలిపి మహిళలను హత్యలు చేసిన వారిని పట్టుకున్నారు. వీటితో పాటు జిల్లాలో గడిచిన ఒక ఆరు నెలలుపాటు దొంగతనాలు విచ్చలవిడిగా జరిగాయి.

■ ఒంటరిగా వెళ్లే మహిళల మెడల్లోని బంగారు గొలుసులు తెంచుకెళ్లారు. మంగళగిరి, తెనాలి, గుంటూరు తూర్పు, పశ్చిమ సబ్ డివిజన్లల్లో ఎక్కువగా జరిగాయి. నెలల వ్యవధిలో వరుసగా చోరీలు జరగడంతో క్రైం పోలీసులకు ఊపిరాడ లేదు. సాక్ష్యాత్తు మాజీ డీఎస్పీ ఇంట్లోనూ చోరీ ఘటన చోటుచేసుకుంది.

■ కూటమి ప్రభుత్వం వచ్చాక సోషల్ మీడియా ఆక్టివిస్టులపై కేసుల పరంపర కొనసాగాయి. ఒకనొక దశలో కేసుల ఉధృతి ఎక్కువైంది. ఒకరిపై ఒక పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు నమోదైతే, మిగతా పది పోలీస్ స్టేషన్లల్లోనూ కేసులు నమోదు చేయడం ఆనవాయితీగా మారింది. ఒక రోజు గుంటూరు జిల్లా కోర్టులో హాజరుపరిస్తే వెంటనే మరో పోలీస్‌స్టేషన్ పోలీస్ అధికారులు వచ్చి వారిని ఎత్తుకెళ్లేవారు. ఇలా వరస ఘటనలతో రాష్ట్రంలో దడపుట్టించారు. రెండేళ్ల క్రితం సంబంధంలేని పోస్టింగ్‌లపై కూడా కేసులు నమోదు చేయడంతో హడలిపోయారు. దీంతో సీఐడీ విభాగం మరింత వేగవంతమైంది. గత కేసులను కూటమి నాయకులు పునఃప్రారంభించారు. ఈ క్రమంలో సంబంధంలేని వారిని గుంటూరు ప్రాంతీయ సీఐడీ కార్యాలయానికి తీసుకువచ్చి, విచారించిన ఘటనలు లేకపోలేదు. విజిలెన్స్ అదే పంథాలో వెళ్తోంది.

## సావిత్రీబాయి పూలే ప్రతిభా అవార్డుకు ఎంపికైన అమరేశ్వరి



**గుంటూరు ఎడ్యుకేషన్:** దక్షిణాది ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపక సంస్థ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డు–2025కు గుంటూరు నగరానికి చెందిన భౌతికశాస్త్ర అధ్యాపకురాలు వంటల అమరేశ్వరి ఎంపికయ్యారు. ఆమె స్వస్థలం దాచేపల్లి కాగా, గుంటూరులోని వివిధ కళాశాలల్లో భౌతికశాస్త్ర అధ్యాపకురాలిగా పని చేస్తూనే నీట్, ఐఐటీ, బిట్‌శాట్, ఎంసెట్ పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణనిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఏఎన్‌యూ భౌతికశాస్త్ర విభాగంలో నానో సైన్స్‌పై పరిశోధనలు చేస్తున్నారు. తన పరిశోధన అంశాన్ని జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో ప్రదర్శించి, విద్యావేత్తల ప్రశంసలు అందుకున్నారు.

గుంటూరులో దశాబ్ద కాలంగా ఫిజిక్స్ క్రియేటివ్ అకాడమీ పేరుతో శిక్షణ సంస్థను నిర్వహిస్తూ, పేద విద్యార్థులకు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఆమె అందించిన సేవలకు గుర్తింపుగా సావిత్రీబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపిక చేసిన నిర్వాహకులు జనవరి 19న గుంటూరు నగరంలో ప్రదానం చేయనున్నారు.

# హిందూ మాదిగ.. మాల ఎలా అయ్యారు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

- సమగ్ర విచారణ జరిపి తుది నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్):** రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలో ఉంచిన ఎస్సీల కులాల నోటిఫికేషన్ తప్పుల తడకగా ఉందని దీనిపై సమగ్ర విచారణ జరిపాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టరేట్ ఎస్‌ఆర్ శంకరన్ హాల్‌కు సోమవారం వచ్చిన వన్‌మెన్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు మందకృష్ణ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా ఇంటి పేరు మంద.. మంద అనే ఇంటి పేరు రాష్ట్రంలో ఎక్కడైన మాదిగ కులంలో ఉంటుందని, కాని కొన్ని ప్రాంతాల్లో మంద ఇంటి పేరు ఉన్నవారు మాల అని నోటిఫై చేశారని, అదే విధంగా కొని ప్రాంతాల్లో మాదిగలకు హిందూ మాదిగ అని ఉంటుంది, కాని మాదిగ క్రిస్టియన్ అని నోటిఫై చేశారని ఆరోపించారు. దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీస్ పోరాడుతూనే ఉందని, వర్గీకరణ అంశం చివర దశకు వచ్చిన సమయంలో మాదిగల జాబితా అంతా తప్పుల తడకగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక సామాజిక వర్గం కింద స్థాయి నుంచి పై స్థాయి వరకు వారే ఉండటంతో మాదిగలను తగ్గించి చూపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై వన్‌మెన్ కమిషన్ పూర్తిగా విచారణ చేపట్టి మాదిగలకు, ఎస్సీలోని ఉప కులాలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు.

**ఐక్యత అనేది బూటకమే ...**

వర్గీకరణ చేయాలనేది మాదిగల కోసమే కాదని, ఎస్సీల్లోని అట్టడగు కులాల వారికి కూడా అందాలనే ఉద్దేశంతో మేం వర్గీకరణ చేయాలని కోరుతున్నామని కృష్ణమాదిగ చెప్పారు. మాదిగలకు వచ్చే అవకాశాలను కూడా మాలలు అనుభవిస్తున్నారని, వర్గీకరణ చేయడం వలన ఎవరికి దక్కాల్సిన అవకాశాలు వారికి దక్కుతాయని చెప్పారు. మాలలోని ఉపకులాలు కొందరు వర్గీకరణ చేయాలని కోరుకుంటున్నాయని, కానీ మాలలు వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. ఎవరికి దక్కాల్సిన వాటాను వారికే దక్కితే ఎవరికి ఇబ్బందులు ఉండవని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## జార్ఖండ్ జట్టు ఆధిక్యం

**మంగళగిరి:** నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో నిర్వహిస్తున్న విజయ్‌మర్చంట్ ట్రోఫీలో జార్ఖండ్ జట్టు ఆధిక్యం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జమ్ము, కశ్మీర్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 55.01 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌటు అయింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన జార్ఖండ్ జట్టు 85.1 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టపోయి 365 పరుగులు చేసింది. వాగ్స్ 108 పరుగులు చేయగా జార్ఖండ్ బౌలర్ అర్జున్ ఆరు వికెట్లు తీసి రాణించాడు.

## యార్డుకు 55,760 బస్తాల మిర్చి రాక

**కొరిటిపాడు(గుంటూరు):** గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 55,760 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 50,214 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.7,500 నుంచి రూ.14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.8,000 నుంచి రూ.16,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 46,445 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

# ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

కలెక్టర్ నాగలక్ష్మి



వర్చువల్‌గా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

**గుంటూరు వెస్ట్:** జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారులతో వర్చువల్‌గా మాట్లాడుతూ గ్రౌండ్ లెవల్ పూర్తయిన ఇళ్ల లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకు లింకేజి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఏర్పడే చిన్న చిన్న సమస్యలను అధికారులు అప్పటికప్పుడే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని తెలిపారు. పోషణ్ వాటికలు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకు రావాలని పేర్కొన్నారు. జిల్లాలో గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బంది హౌస్‌హోల్డ్ సర్వే వేగవంతం చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రతిరోజూ ఆన్‌లైన్ అటెండెన్స్ వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం ఉదయం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎలాంటి అసౌకర్యం లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, సీపీఓ శేషశ్రీ, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డీపీఓ సాయికుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఏఎన్‌యూకు ఆరు పతకాలు

సౌత్ జోన్ యువజన ఉత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విజేతలతో వర్సిటీ అధికారులు

**ఏఎన్‌యూ:** ఆల్ ఇండియా యూనివర్సిటీ(ఏఐయూ) నిర్వహించే అంతర విశ్వవిద్యాలయాల 38వ సౌత్ జోన్ యువజన ఉత్సవాల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆరు పతకాలు సాధించిందని యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.మురళీమోహన్ తెలిపారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన యువజనోత్సవాలలో 24 విశ్వవిద్యాలయాలు పాల్గొన్నాయి. వీటిల్లో ఆరు పతకాలను వర్సిటీ సాధించినట్లు వివరించారు. వాటిల్లో స్పాట్ ఫొటోగ్రఫీలో రెండో స్థానం, మెహందీలో మూడో స్థానం, మైమ్‌లో మూడవ స్థానం, ఇన్ స్టా లేషన్‌లో మూడో స్థానం, కార్టూనింగ్‌లో మూడో స్థానం, కొలేజ్ లో మూడో స్థానం పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీకి పతకాలు సాధించిన విద్యార్థి కళాకారులను ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధర రావు, ఇన్‌చార్జి రెక్టర్ కె.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జి.సింహాచలం అభినందించారు.

# విధులు బహిష్కరించిన న్యాయవాదులు



జిల్లా కోర్టు ఆవరణలో మౌన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

**నగరంపాలెం:** మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీ, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా పనిచేసిన సీనియర్ న్యాయవాది సుదర్శన్‌రెడ్డిపై దాడిని నిరసిస్తూ సోమవారం ది గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ మేరకు బార్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి మాట్లాడుతూ లాయర్ సుదర్శన్‌రెడ్డిపై దాడి చేసి, ఆయనే దాడి చేసినట్లు కట్టు కథ అల్లారని అన్నారు. ఈ ఘటనలో ఆయనతో పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమని పేర్కొన్నారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా ప్రాక్టీస్ ఉన్న న్యాయవాది సుదర్శన్ రెడ్డి అని అన్నారు. ఆయన ప్రతిభను గుర్తించి రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా నియమించారని అన్నారు. చొక్కా పట్టుకుని లాక్కెళ్లిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని పలువురు న్యాయవాదులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, మాజీ కార్యదర్శులు మంజుల, శ్యామల పాల్గొన్నారు.

**నేడు వినతిపత్రాలు..**

పొన్నూరులో న్యాయవాది బి.ప్రకాష్‌పై పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో సమావేశమయ్యారు. ఈ మేరకు కార్యచరణను రూపొందించారు. మంగళవారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాలు అందించాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం కోర్టు ఆవరణలో మౌన ప్రదర్శనగా వెళ్లి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, మాజీ అధ్యక్షులు శాంతకుమార్, సురేష్ పాల్గొన్నారు.

## కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

**తొలిరోజు అర్హత సాధించిన 166 మంది అభ్యర్థులు**



**నగరంపాలెం:** జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి గ్రౌండ్స్‌లోకి అనుమతించడంతో, ఎటువంటి తోపులాట లేకుండా ఒకరి తర్వాత ఒకర్ని లోనికి పంపించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పలువురు పోలీసు అధికారులు దగ్గరుండి ఏర్పాట్లను, దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షించారు. తొలి రోజు దేహదారుఢ్య పరీక్షలకు 290 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 36 మందికి సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుదిగారు. 290 మందిలో 36 మందిని అనర్హులుగా ప్రకటించగా, మిగతా 254 మందికి శరీర కొలత పరీక్షలు(పీఎంటీ) నిర్వహించారు. వీరిలో 39 మందికి ఛాతి, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. 254 మందిలో 39 మంది అనర్హులు కాగా, 215 మందికి 1,600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా, పోటాపోటీగా పరుగెత్తారు. వీరిలో 32 మంది అనర్హులు కావడంతో మిగతా 183 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. 183 మందిలో ఒకరూ వైదొలగా, 182 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీ నిర్వహించారు. వీరిలో 74 మంది అర్హత సాధించగా, 108 మంది అనర్హత పొందారు. 183 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా, వారిలో 166 మంది అర్హత సాధించగా, 17 మంది అనర్హత పొందారు. 254 మంది అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 166 మంది అర్హత సాధించగా, 88 మంది అనర్హత పొందారు.

## ఐసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన యేల్చూరి



**నగరంపాలెం:** ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్(ఐసీసీ) నూతన అధ్యక్షుడిగా యేల్చూరి వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 28న నిర్వహించిన చాంబర్ ఎన్నికల్లో ఆయన ప్యానెల్ గెలుపొందింది. సోమవారం జిన్నాటవర్ కూడలిలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో యేల్చూరి వెంకటేశ్వర్లు, ఆయన ప్యానెల్ సభ్యులు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయనకు పలువురు పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, టీడీపీ నాయకులు కొనకళ్ల సత్యం, షేక్ షౌకత్ పాల్గొన్నారు.

# కళాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత



ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన గురితప్పిన బాణం నటులకు బహుమతి అందజేస్తున్న లలిత కళానికేతన్ కమిటీ సభ్యులు

- తక్కెళ్లపాడులో ముగిసిన జాతీయ స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు
- ప్రథమ ప్రదర్శన గురితప్పిన బాణం ఎంపిక

**పెదకాకాని:** కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్టేట్‌బ్యాంక్ ఏజీఎం ఎంఎస్ఎన్ శర్మ అన్నారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడులో డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో లలిత కళానికేతన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న 14వ జాతీయ స్థాయి ఆహ్వాన పరిషత్ నాటికల పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. న్యాయ నిర్ణేతలు వ్యవహరించిన నూతలపాటి కాళిదాసు, పెద్ది రమేష్‌బాబు, పిన్నమనేని తిరుపతయ్య విజేతల వివరాలు వెల్లడించారు. పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా రసఝరి పొన్నూరు వారి గురితప్పిన బాణం(ప్రథమ), అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇది అతని సంతకం(ద్వితీయ), అమృతలహరి ఆర్ట్స్ థియేటర్ వారి నాన్నా నేనొచ్చేస్తా(తృతీయ) స్థానాల్లో నిలిచాయి. అలానే ఉత్తమ నటుడు కృష్ణమూర్తి పాత్రదారి ఎస్.రవీంద్రరెడ్డి(ఇది అతని సంతకం), ఉత్తమ దర్శకత్వం అమృతలహరి(నాన్నా నేనొచ్చేస్తా), ఉత్తమ రచన పిన్నమనేని మృత్యుంజయరావు(గురితప్పిన బాణం), ఉత్తమ నటి సావిత్రి పాత్రదారి ఎస్ అమృతవర్షిణి(నాన్నా నేనొచ్చేస్తా) ఉత్తమ బాల నటి శ్వేత పాత్రధారిణి ఎస్ యస్మిత(నా శత్రువు), ఉత్తమ సంగీతం కె సాయితేజ, ఉత్తమ ఆహార్యం జి.శ్రీధర్, ఉత్తమ లైటింగ్ ఫణి(గురితప్పిన బాణం)లను ఎంపిక చేశారు. అలానే ఉత్తమ సహాయ నటులు, జూరి ప్రదర్శలు, ఉత్తమ రంగాలంకరణ, జూరి నటులను ఎంపిక చేసి అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

## పెదకాకానిలో కారు బీభత్సం

- మహిళకు గాయాలు
- ఏడు వాహనాలు ధ్వంసం



**పెదకాకాని:** నిత్యం రద్దీగా ఉండే పెదకాకాని సెంటర్లో కారు దూసుకు రావడంతో స్థానికులు పరుగులు తీశారు. విజయవాడకు చెందిన భార్యాభర్తలు పెదకాకాని బాజీ బాబా దర్గాకు బయలుదేరారు.పెదకాకాని చేరుకుని ఫుడ్ బిడ్జి వద్ద వెనిగండ్ల వెళ్లే రహదారిలోకి వెళుతున్న క్రమంలో సోమవారం రాత్రి కారు దూసుకొచ్చి సెంటర్లో ఆపి ఉన్న ఏడు బైకులను ఢీకొంది. ఈ ఘటనలో పక్కనే ఉన్న పెదకాకాని పాతూరు ప్రాంతానికి చెందిన హుస్సేన్ బికి గాయాలయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కారు నడిపిన వ్యక్తిని స్థానికులు నిలదీశారు. కారులో ఉన్న మహిళ స్థానికులతో వాదనకు దిగడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారులో ఉన్న వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.